క్లుప్తంగా

శాంతిభద్రతలకు సీసీ కెమెరాలు కీలకం



పేరూరులో సీసీ కెమెరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అమలాపురం టౌన్: పట్టణం లేదా గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాల వ్యవస్థ కీలకమని పట్టణ సీఐ పి.వీరబాబు అన్నారు. అమలాపురం రూరల్ మండలం పేరూరులో గ్రామ పెద్దలకు సీసీ కెమెరాల వ్యవస్థపై శుక్రవారం ఆయన అవగాహన కల్పించారు. గ్రామంలోని భేతాళస్వామి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయం, శివాలయం వద్ద గ్రామ భద్రత దృష్ట్యా సీసీ కెమెరాల ఆవశ్యకతను పట్టణ ఎస్సై కిషోర్‌బాబు వివరించారు. ఈ క్రమంలో గ్రామస్తులు 20 సీసీ కెమెరాల ఏర్పాటుకు అంగీకరించారు. వీరిని సీఐ వీరబాబు అభినందించారు.

సమావేశానికి వారిని పంపుతారా?



మాట్లాడుతున్న ఎంపీపీ జానకి

ఉప్పలగుప్తం: అధికారుల పాల్గొనాల్సిన సర్వసభ్య సమావేశానికి కింది స్థాయి సిబ్బంది రావటంతో సభ నిరుపయోగం అవుతుందని జెడ్పీటీసీ గెద్దం సంపదరావు మండిపడ్డారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దంగేటి వీరఅచ్యుతజానకి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి విద్యుత్, ఆర్‌అండ్‌బీ అధికారులు రాకుండా, కార్యాలయ సిబ్బందిని పంపడంపై జెడ్పీటీసీతో పాటు, సర్పంచ్ బద్రి బాబ్జి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మత్స్యకారులకు పరిహారం వాయిదా

తాళ్లరేవు: మత్స్యకారులకు ఈ నెల 28న అందించాల్సిన ఓఎన్‌జీసీ పరిహారానికి సంబంధించి కార్యక్రమం వాయిదా పడినట్లు ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు తెలిపారు. శుక్రవారం ఆయన కోరంగిలో విలేకర్లతో మాట్లాడారు. ఓఎన్‌జీసీ కార్యకలాపాల కారణంగా నష్టపోయిన మత్స్యకారులకు సుమారు రూ.149 కోట్లు అందించే కార్యక్రమాన్ని శనివారం ఏర్పాటు చేశారు. మాజీ ప్రధాని డా.మన్మోహన్ సింగ్ మరణం కారణంగా ఈ కార్యక్రమాన్ని జనవరి 3వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు.

రుణాల చెల్లింపునకు గడువు ఇవ్వాలి

అమలాపురం టౌన్: బోడసకుర్రులోని టిడ్కో ఇళ్లకు సంబంధించి బ్యాంక్‌ల నుంచి రుణాలు తీసుకున్న వారికి 60 రోజుల్లో చెల్లించాలని గడువు ఇచ్చారని, గడువు మీరితే వేలం వేస్తామని నోటీసులు ఇచ్చారని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. వేలాన్ని నిలుపుదల చేయాలని, తమకు మరింత గడువు ఇవ్వాలని లబ్ధిదారులు అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ కేవీవీఆర్ రాజుతో పాటు, మున్సిపల్ కౌన్సిలర్లకు శుక్రవారం వినతిపత్రాలు అందించారు. బోడసకుర్రు నుంచి లబ్ధిదారులు అమలాపురం మున్సిపల్ కార్యాలయానికి వచ్చి అధికారులు, ప్రజాప్రతినిధులకు తమ గోడు వినిపించారు. టిడ్కో అధికారి డి.లలితకుమారికి కూడా వినతిపత్రం అందించారు.

సుదర్శన్‌బాబు సేవలు చిరస్మరణీయం



సుదర్శనబాబు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఐ.పోలవరం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు, దివంగత నేత భూపతిరాజు సుదర్శన్‌బాబు సేవలు చిరస్మరణీయమని పార్టీ మండల అధ్యక్షుడు పిన్నమరాజు వెంకటపతిరాజు అన్నారు. పలు గ్రామాల్లో సుదర్శన్‌బాబు వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. పాత ఇంజరం పోలీస్ స్టేషన్, ఐ.పోలవరం హైస్కూల్ సెంటర్‌లోని సుదర్శన్‌బాబు విగ్రహాలకు పార్టీ నాయకులు నివాళులర్పించారు. ఎంపీపీ మోర్తా రాణి మిరియం జ్యోతి, నాయకులు ఏలూరి ఆదినారాయణ, కాశే రాజబాబు, కాటం సత్తిరాజు, మోర్తా వీరరాఘవులు, రవివర్మ, కాదా గోవింద కుమార్ పాల్గొన్నారు.

భద్రకాళీ మాతకు చామంతుల పూజ

తాళ్లరేవు: ధనుర్మాసం ద్వాదశి పర్వదినం సందర్భంగా సుంకరపాలెం శివాలయంలో శుక్రవారం భద్రకాళీ అమ్మవారికి చామంతుల పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామివారికి వంద కిలోల చామంతులు, గులాబీలలో పూజ చేసి ప్రత్యేకంగా అలంకరించారు.

తప్పిన మాటపై పోరు బాట

- విద్యుత్ చార్జీల పెంపుపై కదం తొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- పట్టణంలో ఈదరపల్లి వంతెన మీదుగా భారీ ర్యాలీ
- సబ్ స్టేషన్ వద్ద నిరసన
- ఎస్ఈ, ఈఈలకు వినతిపత్రాలు



పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా ఈదరపల్లిలో ర్యాలీ చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు విశ్వరూప్, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, మాజీ ఎంపీ అనురాధ తదితరులు




విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న విశ్వరూప్, ఇజ్రాయిల్, అనురాధ తదితరులు

అమలాపురం రూరల్: విద్యుత్ చార్జీలను పెంచేది లేదంటూ ఎన్నికల ముందు ప్రజలను నమ్మబలికి, అధికారం చేపట్టాక కూటమి ప్రభుత్వం మాట తప్పింది. ఈ క్రమంలోనే ప్రజల నడ్డి విరిచేలా కూటమి ప్రభుత్వం భారీగా పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపుమేరకు, విద్యుత్ చార్జీలపై పోరుబాట కార్యక్రమంలో అమలాపురం నియోజకవర్గానికి చెందిన పార్టీ శ్రేణులు కదంతొక్కారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పోరుబాటకు పెద్దఎత్తున తరలివచ్చి, నిరసన తెలిపారు. అమలాపురం పట్టణంలోని హైస్కూల్ సెంటర్‌లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నుంచి బయలుదేరిన ఈదరపల్లి వంతెన వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం మీదుగా ర్యాలీ సబ్‌స్టేషన్ వరకు కొనసాగింది. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ అక్కడ ధర్నా నిర్వహించారు. ఈఈ కార్యాలయంలో ఎస్ఈ రాజబాబు, ఈఈ మోకా రవికుమార్‌కు ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణ రావు, బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎంపీ చింతా అనురాధతో కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా విశ్వరూప్ మాట్లాడుతూ, కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే ప్రజలపై రూ.15,485 కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపిందన్నారు. ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని, అవసరమైతే చార్జీలు తగ్గిస్తామని ప్రచారంలో ఊదరగొట్టిన చంద్రబాబు.. తీరా సీఎం అయిన ఆరు నెలల్లో చార్జీల భారం మోపడం దారుణమన్నారు. సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎంపీ చింతా అనురాధ మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచిందన్నారు. ఈ చార్జీలను తగ్గించేవరకు వైఎస్సార్ సీపీ ఉద్యమాలు చేస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికల్లో చంద్రబాబు ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి, అధికారంలో వచ్చాక ప్రజలపై చార్జీల భారం పెంచడం వల్ల పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, కామిశెట్టి శ్రీనివాసరావు, పార్టీ పట్టణ, మండలాల అధ్యక్షులు, సంసాని బులినాని, బొంతు గోవిందశెట్టి, కొనుకు బాపూజీ, బద్రి బాబ్జి, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, ఎంపీపీలు కుడిపూడి భాగ్యలక్ష్మి, ఇళ్ల శేషారావు, జెడ్పీటీసీలు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, గెద్దం సంపదరావు, కొనుకు గౌతమి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌ఖాదర్, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు జున్నూరి వెంకటేశ్వరరావు, జిల్లా లీగల్ సెల్ మాజీ అధ్యక్షుడు కుడుపూడి త్రినాథ్, మాజీ జెడ్పీటీసీ కుడుపూడి బాబు, జిల్లా ఐటీ విభాగం అధ్యక్షుడు తొరం గౌతమ్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మెండగుదటి శిరీష్, జిల్లా కార్యదర్శులు కముజు రమణ, నిమ్మకాయల హనుమంతు శ్రీనివాసరావు సర్పంచ్‌లు గుత్తుల చిరంజీవి, చెల్లుబోయిన నాని, దాసరి అరుణ, కౌన్సిలర్లు చిట్టూరి పెదబాబు, నాగరపు వెంకటేశ్వరరావు, గొవ్వాల రాజేష్, కొల్లాటి దుర్గాబాయి, నాయకులు కుడిపూడి భరత్‌భూషణ్. వంటేద్దు వెంకన్ననాయుడు, సూదా గణపతి, దంగేటి రాంబాబు. పోగాకు శ్రీను. దంగేటి రుద్ర. ఉంద్రు వెంకటేష్, వంగా గిరజాకుమారి. తిక్కా వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ముమ్మిడివరంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే పొన్నాడ, పార్టీ శ్రేణులు



ఏడీఈ శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన గళం

- ముమ్మిడివరంలో వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆందోళన
- భారీ బైక్ ర్యాలీ, సబ్ స్టేషన్ వద్ద నిరసన
- ఏడీఈకి వినతిపత్రం అందజేత

ముమ్మిడివరం: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా వైఎస్సార్ సీపీ శ్రేణులు శుక్రవారం ఆందోళన బాట పట్టారు. ముమ్మిడివరం పార్టీ కార్యాలయం నుంచి మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున చేరుకుని, బల్లగేటు సెంటర్, లంకతల్లమ్మ గుడి, విష్ణాలయం సెంటర్, మార్కెట్ సెంటర్ మీదుగా కాశివాని తూము బైపాస్ రోడ్డు వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ, డిమాండ్ చేశారు. అలాగే కొండాలమ్మ చింత సెంటర్ నుంచి సబ్ స్టేషన్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి, పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, పేదల నడ్డి విరుస్తున్న చంద్రబాబునాయుడు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఏపీఈపీడీసీఎల్ ఏడీఈ డి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ, సూపర్ సిక్స్ పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు. ఇప్పుడు విద్యుత్ చార్జీలు పెంచి, పేద, మధ్య తరగతి ప్రజలపై పెను భారం మోపిందన్నారు. తాము అధికారంలోకి వస్తే ఐదేళ్లలో విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికలలో చంద్రబాబు నాయుడు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారని, ఇప్పుడు ఆరు నెలల తిరక్కుండానే చార్జీల భారం ప్రజలపై మోపారని తీవ్రంగా విమర్శించారు. ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ పోరాడుతుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు పెయ్యల చిట్టిబాబు, పెన్మత్స చిట్టిరాజు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ పెయ్యల భూలక్ష్మి, కాశి బాలమునికుమారి, పార్టీ మండల అధ్యక్షులు జగతా పద్మనాభం, నల్లా నరసింహమూర్తి, పిన్నమరాజు వెంకటపతిరాజు, కాదా గోవిందకుమార్, ఎంపీపీలు కోలా గంగాభవాని, కాశి మిరియాం జ్యోతి, జెడ్పీటీసీలు కుడిపూడి శంకరరావు, నేల కిశోర్‌కుమార్, కోలా బాబ్జీ, మట్టపర్తి సత్యనారాయణ, పెమ్మాడి బాబురావు, చింతా నాగమునీంద్రరావు, కాశి రామకృష్ణ, కాశి జగపతిరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పెద్దఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

నగర పంచాయతీ అభివృద్ధికి కృషి

- కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే దాట్ల
- రూ.25.78 కోట్లతో వార్షిక బడ్జెట్



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుబ్బరాజు

ముమ్మిడివరం: అన్ని విధాలా నగర పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. నగర పంచాయతీ సమావేశ మందిరంలో శుక్రవారం చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ వార్షిక బడ్జెట్ సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అకస్మిక మృతికి సమావేశం రెండు నిమిషాలు మౌనం పాటించింది, ఎమ్మెల్యే మాట్లాడుతూ, నగర పంచాయతీ అభివృద్ధికి ఇప్పటికే రూ.1.20 కోట్లు మంజూరు చేశామన్నారు. మారుమూల ప్రాంతాల్లో పుంత రోడ్లు ఆధునీకరణకు వీటిని కేటాయించామన్నారు. చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఫ్లోర్‌లీడర్ ములపర్తి బాలకృష్ణ మాట్లాడుతూ, నగర పంచాయతీలో మంచినీటి సమస్య, ఏఐఐబ్యాంకు నిధులతో చేపట్టిన మంచినీటి ప్రాజెక్టు పనుల పునరుద్ధరణ, పారిశుధ్య కార్మికుల కొరత, పోలమ్మచెరువు, అయ్యవారి చెరువుల ఆధునీకరణ వాకింగ్ ట్రాక్ నిర్మాణాలు, డంపింగ్ యార్డు, శ్మశాన వాటిక ఆధునీకరణ వంటి సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. నగర పంచాయతీ అభివృద్ధి పనులకు రూ.88 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని, ఈ నిధులు వెంటనే మంజూరు చేస్తామన్నారు. ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియా కంపెనీల ద్వారా సీఎస్ఆర్ నిధులకు కృషి చేస్తామన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

వార్షిక బడ్జెట్ రూ.25.78 కోట్లు

నగర పంచాయతీ 2025–26 ఆర్థిక సంవత్సరానికి అంచనా వార్షిక బడ్జెట్‌ను రూ.25.78 కోట్లతో సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. గతేడాది బడ్జెట్‌ను సవరిస్తూ, వచ్చే ఏడాదికి అంచనా బడ్జెట్‌ను రూపొందించారు. ప్రారంభ నిల్వ రూ.54.67 లక్షలతో పాటు, వివిధ ఆధాయ వనరుల నుంచి రాబడిని రూ.25.24 కోట్లుగా చూపిస్తూ, బడ్జెట్ రూపొందించారు.

కౌన్సిల్ నిర్ణయాలను పట్టించుకోరా?

- ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్ ధ్వజం
- సమావేశంలో పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్ల మధ్య రగడ



కౌన్సిల్ సమావేశంలో పాలక, ప్రతిపక్ష సభ్యుల వాదోపవాదాలు

అమలాపురం టౌన్: కౌన్సిల్ నిర్ణయాలను పట్టించుకోరు, కౌన్సిలర్ల మాటలను వినిపించుకోరు. వారు లేవనెత్తే తప్పులను సరిదిద్దుకోకుండా ఇష్టానుసారం నిర్ణయం తీసుకుంటే ఎలా? అని ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్ మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం జరిగిన కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా జరిగింది. చమురు సంస్థల ద్వారా రావాల్సిన రాయల్టీ నిధులను మున్సిపాలిటీ సాధించి, అభివృద్ధికి వెచ్చించాలన్న తన సూచనపై ఏం చర్యలు తీసుకున్నారని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు కమిషనర్‌ను ప్రశ్నించారు. మున్సిపల్ షాపుల్లో వంటలకు గ్యాస్ స్టౌలు వాడరాదన్న నిబంధన ఉన్నప్పటికీ, ఎందుకు లీజుకు ఇస్తున్నారని ఎమ్మెల్సీ నిలదీశారు. పట్టణంలో ఇలా రెండు మున్సిపల్ షాపులను లీజుకివ్వడంపై అభ్యంతరం చెప్పారు.

మళ్లీ సబ్ లీజులపై రగడ

మున్సిపాలిటీ షాపింగ్ కాంప్లెక్సుల్లో ఎక్కువ షాపులు సబ్ లీజులపై నడుస్తున్నాయని కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కేఎఫ్‌సీ సంస్థకు ఓ కాంట్రాక్టర్ ఇచ్చిన సబ్ లీజుపై కౌన్సిలర్లు బొర్రా వెంకటేశ్వరరావు, అబ్బిరెడ్డి చంటి తదితరులు ప్రశ్నించారు. ఈ కాంట్రాక్టర్ సర్క్యులర్ బజార్‌లో ఓ మున్సిపల్ షాపును అద్దెకు తీసుకుని, సబ్ లీజుకు ఇవ్వడమే కాకుండా, రూ.లక్షకు పైగా అద్దె బకాయి ఉందని కౌన్సిలర్లు చెప్పారు. అద్దె బకాయి ఉన్న ఆ కాంట్రాక్టర్‌కు మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని భవనాన్ని నిబంధనలకు విరుద్ధంగా అద్దెకు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. సబ్ లీజుకు ఇచ్చిన విషయాన్ని గత కౌన్సిల్ సమావేశం దృష్టికి తెస్తే, ఎందుకు పట్టించుకోలేదని కమిషనర్‌ను ప్రశ్నించారు.

పోడియం వద్దకు కౌన్సిలర్లు

అజెండా 26 అంశాలతో భారీ సబ్జెక్టులతో ఉంటే ఒక్క అంశం కూడా ముందుకు సాగకుండా, జీరో అవర్‌లో వేయాల్సిన ప్రశ్నలు సమావేశానికి ముందే వేస్తే ఎలా అంటూ పాలకపక్ష కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులినాని, గొవ్వాల రాజేష్ ప్రతిపక్ష కౌన్సిలర్లపై ధ్వజమెత్తారు. దీంతో ఇరు పక్షాల మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. సబ్ లీజులపై తాము అడిగిన ప్రశ్నలకు కమిషనర్ బదులు చెప్పాలంటూ పట్టుబట్టి ప్రతిపక్ష కౌన్సిలర్లు చైర్‌పర్సన్ పోడియాన్ని చుట్టుముట్టారు. పాలకపక్ష కౌన్సిలర్లూ పోడియం వద్దకెళ్లి ఎదురు దాడికి దిగారు. తమ వార్డుల్లో పారిశుధ్య కార్మికులు డ్రైన్లను బాగు చేయడం లేదని పాలకపక్ష కౌన్సిలర్లు చిత్రపు రామకృష్ణ, నాగారపు వెంకటేశ్వరరావు అధికారులను ప్రశ్నించారు. పాలకపక్ష కౌన్సిలర్లు దొమ్మేటి రాము, చిట్టూరి పెదబాబు కూడా పలు సమస్యలపై అధికారుల వైఖరిని తప్పుపట్టారు. మున్సిపల్ డీఈఈ సీహెచ్ నాగసతీష్, రెవెన్యూ అధికారి భూపతి శ్రీలక్ష్మి కౌన్సిలర్లు అడిగిన పలు ప్రశ్నలకు బదులిచ్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తిక్కిరెడ్డి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

షెడ్డు నిర్మించకుంటే నిరసన



దూడల వీరీతాదేవి

అమలాపురం టౌన్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో గత ప్రభుత్వ హయాంలో ఓ దాత రూ.12 లక్షల వ్యయంతో ఇచ్చిన జనరేటర్‌ను అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారని ఆలయ మాజీ చైర్‌పర్సన్ దూడల వీరీతాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. షెడ్డు లేకపోవడంతో ఇప్పటివరకు ఆ జనరేటర్ ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, అధికారుల నిర్లక్ష్యానికి గురవుతోందని ఆమె ధ్వజమెత్తారు. పది నెలలుగా అలాగే ఉన్న ఆ జనరేటర్‌కు షెడ్డు నిర్మించాలని ఆమె సూచించారు. రెండు రోజుల్లో చర్యలు చేపట్టకపోతే, జనరేటర్ వద్ద కూర్చుని నిరసన తెలుపుతానని ఆమె హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం ఆమె ఈ విషయాన్ని మీడియాకు తెలిపారు. తాను ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్‌గా ఉన్నప్పుడు ఆలయ అభివృద్ధికి పాటుపడ్డానన్నారు. అధికారులు మాత్రమే దాతల స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు.

బాలికల భద్రత సామాజిక బాధ్యత

అల్లవరం: సమాజంలో బాలికల భద్రత సామాజిక బాధ్యత అని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఐసీడీఎస్ సీడీపీఓ వై.విజయశ్రీ ఆధ్వర్యంలో కిశోర్ వికాసంపై అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, మహిళా సంరక్షణ కార్యదర్శులకు శుక్రవారం శిక్షణ నిర్వహించారు. జెడ్పీటీసీ కొనుకు గౌతమి హాజరయ్యారు. సీడీపీఓ విజయశ్రీ , ఎంఈఓ ఎస్.ఏడుకొండలు, ఏపీఎం సయ్యద్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

చెల్లిరామ్‌కు అవార్డు



యానాం: ఐ పోలవరానికి చెందిన పుల్లెల తాతయ్య మెమోరియల్ అసోసియేషన్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్వామినేని–త్రిపురనేని ఇంటిగ్రల్ హ్యూమనిస్ట్ అవార్డుకు యానాంకు చెందిన ప్రముఖ కవి చెల్లిరామ్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ సంస్థ నుంచి శుక్రవారం సమాచారం అందింది. జనవరి 5న ఐ పోలవరం హైస్కూల్‌లో అవార్డు అందుకోనున్నారు.

నైపుణ్య అభివృద్ధిపై శిక్షణ

అమలాపురం టౌన్: మెప్మా ఆధ్వర్యంలో మున్సిపాలిటీలో వివిధ విభాగాల నుంచి సేవలందించే సిబ్బందికి నైపుణ్య అభివృద్ధిపై శిక్షణా కార్యక్రమాలు శుక్రవారం నుంచి స్థానిక మెప్మా కార్యాలయంలో ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు ఈ శిక్షణ ఉంటుందని మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు తెలిపారు. మున్సిపాలిటీలో వివిధ విభాగాల్లో సేవలందిస్తున్న ప్లంబర్లు, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, ఎలక్ట్రానిక్ పరికరాల టెక్నీషియన్లు, బ్యూటీషియన్లు, పెయింటర్లు ఈ శిక్షణకు అర్హులని చెప్పారు. ఎన్ఎస్‌డీసీ ద్వారా శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్‌తో పాటు, జీవనోపాధి చూపిస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ధ్రువపత్రాలతో శిక్షణకు హాజరు కావాలని సూచించారు.

సీపీఐ శత వార్షికోత్సవం

ముమ్మిడివరం: సీపీఐ శత వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు శీలం వెంకటేష్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

యానాం: పట్టణంలోని గణపతినగర్‌లో ప్రజా పనుల శాఖ చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పరిశీలించారు. పనులను నాణ్యతతో, వేగవంతంగా చేయాలని కోరారు.

అన్నదాన ట్రస్ట్‌కు విరాళం

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వర స్వామి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు శుక్రవారం తాడేపల్లిగూడేనికి చెందిన దుగ్గిన శ్రీనివాసరావు రూ.10,116 విరాళం అందజేశారు. ఆయనకు ప్రత్యేక దర్శనం కల్పించి, శేషవస్త్రం, స్వామి చిత్రపటం, ప్రసాదం అందించారు.

పరిశోధన పత్రం సమర్పణ

అమలాపురం టౌన్: బెంగళూరులోని శాస్త్ర విశ్వవిద్యాలయంలో ఇటీవల జరిగిన ప్రపంచ వేదిక్ సైన్స్ సదస్సులో స్థానిక కొంకాపల్లి జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయుడు పీవీఎల్ఎన్ శ్రీరామ్ పరిశోధన పత్రం సమర్పించారు. ‘భారతీయ సంప్రదాయ ఆటల్లో గణిత అంతర్భావాలు’ అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పించినట్లు శ్రీరామ్ తెలిపారు. డీఈవో షేక్ సలీమ్ బాషా, డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశం తదితరులు ఆయనను అభినందించారు.

ప్రహ్లాద బాబా జయంతి

అల్లవరం: కొమరగిరిపట్నం శివారు తోటరి పందిరి ఆశ్రమంలో సద్గురు ప్రహ్లాద బాబా 105వ జయంతి వేడుకలు శుక్రవారం జరిగాయి. ఆశ్రమంలో ప్రణవ పతాక ఆవిష్కరణ, గామోత్సవం, అఖండ భగన్నామ సంకీర్తనలు, దీపోత్సవం కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ మాస్ట్రో గజల్ శ్రీనివాస్ భక్తి గానలహరి జరిగింది.

ఆర్‌ఏఓకు ఫిర్యాదు

యానాం: సోషల్ వెల్ఫేర్ శాఖ ద్వారా వృద్ధులకు ఉచితంగా అందించాల్సిన దుస్తులు, చెప్పులను గొడౌన్లలో ఎలుకలు కొట్టేస్తున్నాయని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్ధాని దినేష్ చెప్పారు. ఈ మేరకు శుక్రవారం పరిపాలనాధికారి కార్యాలయంలో ఆర్‌ఏఓ మునిస్వామికి ఫిర్యాదు చేశారు. దీనివల్ల రూ.లక్షల విలువైన వస్తువులు పాడైపోతున్నాయన్నారు.

వీఆర్వోలపై పెత్తనం తగదు

అమలాపురం రూరల్: సచివాలయాల్లో కొందరు పంచాయతీ కార్యదర్శులు వీఆర్వోలకు మెమోలిచ్చి, జీతాలు నిలుపుదల వంటి విధానాలతో పెత్తనం చలాయిస్తున్నారని అమలాపురం మండల గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ సమావేశం ఆరోపించింది. కచేరి చావిడిలో శుక్రవారం జరిగిన ఈ సమావేశానికి అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటగణేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై చర్చించారు.

భూ సమస్యలు పరిష్కరించుకోవాలి

ముమ్మిడివరం: రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలు పరిష్కరించుకోవాలని అమలాపురం ఆర్డీఓ, జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి కె.మాధవి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. మొత్తం 123 అర్జీలు అందాయి. తహసీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: వన్నెచింతలపూడి సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సు జరిగింది. తహసీల్దార్ కిషోర్‌బాబుకు పలువురు అర్జీలు అందించారు.

తాళ్లరేవు: ఉప్పంగల పంచాయతీ సర్పంచ్ శాఖా శంకరుడు అధ్యక్షతన స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సు జరిగింది. దేవస్థాన భూములతో పాటు, వివిధ భూ సమస్యలపై అర్జీలు అందాయి.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

అమలాపురం టౌన్: విక్టరీ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఇటీవల కాకినాడలో నిర్వహించిన మూడో జాతీయ స్థాయి కరాటే పోటీల్లో స్థానిక వాగ్దేవి స్కూలుకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటి 17 పతకాలు, షీల్డ్‌లను కైవసం చేసుకున్నారు. జూనియర్ కటాస్ విభాగంలో ఏడుగురు బంగారు పతకాలను, ఆరుగురు రజత, నలుగురు కాంస్య పతకాలు సాధించారని స్కూలు డైరెక్టర్ పరసా భరత్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. రామచంద్రమూర్తి తెలిపారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌కు నివాళులు

ముమ్మిడివరం: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ శ్రద్ధాంజలి ఘటించారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పలువురు నాయకులు నివాళులర్పించారు. అదేవిధంగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరనిలోటని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ సమావేశ మందిరంలో శుక్రవారం మన్మోహన్ చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు.